ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



కర్ణాటక వార్తలు
శుక్రవారం 28 నవంబరు 2025

సామాజిక మాధ్యమాలతోనే
పిల్లల్లో డిప్రెషన్
● బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ కోసంబి
● తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- వివరాలు 6 లో



నేనే సీఎం..!





● తరచూ సిద్దరామయ్య వ్యాఖ్యలు ● ఇవే ఆయన కొంపముంచనున్నాయా..? ● రెండున్నరేళ్లుగా మౌనంగానే డీకే శివకుమార్
● అధిష్టానం ఆచితూచి అడుగులు ● జోరందుకున్న గ్రూపు రాజకీయాలు ● కార్యకర్తల్లో ఆందోళన

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో నెలకొన్న గందరగోళం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే సందిగ్ధంలో పార్టీ అధిష్టానం తలమునకలవుతోంది. అయితే నిర్ణయం తీసుకునేందుకు ముందుగానే సీఎం సిద్దరామయ్య పదేపదే 'నేనే ఐదేళ్ళు సీఎం' అనడమే పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏ విషయమైనా తీవ్రంగా పరిగణించడంతో పాటు ధీటుగా మాట్లాడే డీసీఎం డీకే శివకుమార్ ఈవిషయంలో గంభీరత్వాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. అదే ఆయనకు కలిసివచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

జాతీయ స్థాయిలో పార్టీకి తగ్గిన బలం

జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్ ఉనికిని కోల్పోయి పుష్కరకాలం కావస్తోంది. మూడో సారి లోక్‌సభ ఎన్నికల్లో కమలదళాన్ని ధీటుగా ఎదుర్కొనేందుకు ఐఎన్‌డీఐఏ కూటమిని ఏర్పాటు చేసుకోవడంతో ప్రతిపక్షనేత హోదా ద్వారా అగ్రనేత రాహుల్‌గాంధీకి ఉన్నతమైన పదవి దక్కినట్లు అయ్యింది. కానీ ఇటీవల జరిగిన బిహార్ ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా సొంతంగా ఆరుస్థానాలకు మించలేక పోయారు.

కాంగ్రెస్‌కు బలం కర్ణాటకలోనే..

దేశంలోనే ప్రస్తుతం కాంగ్రెస్‌కు బలమైన అస్త్రమే కాదు అన్నింటా ఎంతో కొంత చెప్పుకునే పెద్దరాష్ట్రమంటే కర్ణాటక మాత్రమే. దక్షిణాదిన తెలంగాణలోను కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా ఇక్కడి రాష్ట్రంతో ఏవిషయంలోను పోల్చలేనిదిగా ఉంది. దీంతో కర్ణాటక రాజకీయాల విషయంలో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో రెండున్నరేళ్ళ పాలన ముగిసిన తరుణంలో రగిలిన మార్పు జ్వాలను ఏవిధంగా ఆర్పాలనేది అధిష్టానానికి సవాల్‌గా మారింది. ఇక్కడి తలెత్తిన సంక్షోభం దారితప్పితే అధిష్టానంలోని అందరి వైఫల్యమే అవుతుంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కర్ణాటక వారు కావడంతో ఆయన వర్గం కూడా ఉంది. ఇక డీసీఎం డీకే శివకుమార్ విషయం ప్రస్తావనకు వస్తే ఆయన ఇటీవల మూడేళ్ళుగా జాతీయస్థాయిలో పార్టీకి ఏ ప్రాంతంలో సమస్య వచ్చినా ఆయననే ఎంపిక చేసి అగ్రనేతలు పంపుతున్నారు. మహారాష్ట్ర వివాదమే కాకుండా అంతకుముందు కూడా తెలంగాణ సహా పలు రాష్ట్రాల అంశాలలో డీకే శివకుమార్‌ను పంపారు. కానీ సొంతరాష్ట్రం విషయంలో నిర్లక్ష్యం చేయడం లేదా కాస్త ఓర్చుకోమని చెప్ప పరిస్థితి లేకుండా పోయింది. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర దేశంలోనే విజయవంతంగా జరిగింది కర్ణాటకలోనే అనేది అధిష్టానానికి తెలిసిందే.

అతి విశ్వాసమే కారణమా..?

రెండున్నరేళ్ళుగా సీఎంగా కొనసాగుతున్న సిద్దరామయ్య ఏడాదికి ముందు పలు సందర్భాలలో నేనే ఐదేళ్ళు కొనసాగుతానన్నారు. ఆ తర్వాత మౌనంగా ఉన్నా ఇటీవల రెండునెలల కాలంగా పదేపదే నేనే ఐదేళ్ళు సీఎంగా ఉంటానని వచ్చే బడ్జెట్ ప్రవేశ పెడతానన్నారు. ఆయనకు ఆప్తులుగా ఉండే మంత్రులు భిన్నమైన వ్యాఖ్యలు, లంచ్, డిన్నర్ మీటింగ్‌లు ఢిల్లీ ప్రదర్శనలంటూ ఎన్నెన్నో మతలబులకు కారకులయ్యారు. రెండునెలల కిందట ఢిల్లీలోనే అదే విషయాన్ని ప్రస్తావించారు. ఇటీవల వరుసగా నేనే సీఎం అంటూ వచ్చిన సిద్దరామయ్య పదిరోజుల కిందట మాత్రం అధిష్టానం సూచిస్తే మరో రెండున్నరేళ్ళు కొనసాగుతానన్నారు. ఆ తర్వాత కూడా వచ్చే బడ్జెట్ నేనే ప్రవేశపెడతానన్నారు. ఇక అనూహ్యంగా దళిత మంత్రుల రహస్య సమావేశాలు, డిన్నర్ మీటింగ్‌లకు సిద్దరామయ్య కారణమనేది కూడా అధిష్టానానికి సమగ్ర నివేదిక చేరినట్లు తెలుస్తోంది. నాయకత్వ మార్పు అంశం తీవ్రమైనప్పుడు దళిత సీఎం ప్రస్తావన కూడా వచ్చింది. దీని వెనుక ఎవరనేది తెలిసిన విషయమే అనిపార్టీలోనే చర్చ సాగుతోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే బెంగళూరుకు వచ్చినప్పుడు ఇంటికెళ్ళి వివాదంపై సీఎం చర్చలు జరిపారు. తాజాగా మాత్రం అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడతానని అంటున్నారు. సిద్దరామయ్య బీసీ వర్గానికి చెందిన వారు కావడంతో పాటు మాస్ ఫాలోయింగ్ ఉన్న నేతగా గుర్తింపు కలిగి ఉన్నారు. బీసీ కులాల ఫెడరేషన్‌లలోను ఈయన భాగస్వామ్యం పెరిగేలా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పలుమార్లు ప్రోత్సహిస్తోంది. సిద్దరామయ్య అల్పసంఖ్యాత (మైనార్టీ), హిందుళిత(బీసీ కులాల), దళిత(ఎస్‌సీ, ఎస్టీ) కులాలను ఐక్యం చేసేలా 'అహింద' పేరుతో రాజకీయాల్లో కొనసాగుతున్నారు. కానీ ఇటీవల సిద్దరామయ్య వ్యాఖ్యల పట్ల అధిష్టానం ఏవిధంగా నిర్ణయం తీసుకుంటుందనేది ఆయన భవిష్యత్తుపై ఆధారపడింది.

డీసీఎం రెండున్నరేళ్లుగా గంభీరత్వమే

సాధారణంగా ఎటువంటి అంశమైనా ఆవేశంగాను, ఆగ్రహంగా ధీటుగా సమాధానం ఇస్తారనే పేరున్న డీసీఎం డీకే శివకుమార్ నాయకత్వ మార్పు అంశంలో గంభీరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. రెండేళ్ళుగా సిద్దరామయ్య సీఎంగా ఐదేళ్ళు ఉంటారని పలువురు మంత్రులతో పాటు పార్టీలోని ఆయన వర్గీయులు బహిరంగంగా వివాదాలు కలిగించేలా మాట్లాడారు. కానీ డీకే శివకుమార్ మాత్రం ఏవిధంగాను స్పందించకుండా అధిష్టానం ద్వారా కట్టడి చేయించారు. ఇటీవల రెండునెలలుగా నవంబరు క్రాంతి అంశం ప్రస్తావన వచ్చినప్పుడల్లా దాటవేశారు. పలుమార్లు సిద్దరామయ్య చెప్పిందే ఫైనల్ అంటూ మరోవిధంగా మాట్లాడే ప్రయత్నమే చేయలేదు. తాజాగా మరో ఏడాది బడ్జెట్ ప్రవేశపెడతాననే సిద్దరామయ్య వ్యాఖ్యలకు సీఎం చెప్పారా అంటే అంతే ఇక నేనెందుకు మాట్లాడతానంటూ దాటవేశారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవిపై పెట్టుకున్న ఆశలను ఏడాది కిందట ఒక్కలిగ కుల సమావేశంలోనూ ప్రస్తావించారు. కానీ పార్టీ మీటింగ్‌లలో నోరు జారలేదు. తాజాగా గురువారం అధిష్టానానికి చెందిన ఐదుగురు ముఖ్యుల సమక్షంలో ఏం జరిగిందనేది తానెందుకు బహిరంగం చేస్తానన్నారు. దీనిని బట్టి అధిష్టానంకు ఒక విషయాన్ని పరోక్షంగా గుర్తు చేశారు. డీకే శివకుమార్ గతంలో చేసిన పోస్టింగ్ తాజాగా వైరల్ అయ్యింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమనేది ప్రపంచంలోనే పెద్ద శక్తిలాంటిదని రాసుకున్నారు. కానీ డీకే శివకుమార్ గంభీరం వెనుక పార్టీ పెద్దల అభయమే కారణమా అనే కుతూహలం కూడా లేకపోలేదు. బలమైన కారణమే ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నికలకు వెళ్లడమే సమంజసం: మాజీమంత్రి రాజణ్ణ

వివాదాస్పద, సంచలన వ్యాఖ్యలకు పేరొందిన మాజీ మంత్రి రాజణ్ణ గురువారం మరో సంచలన అంశమే లేవనెత్తారు. రెండున్నరేళ్ళ నాయకత్వ మార్పు అనేది పక్కన పెట్టి శాసనసభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలకు వెళ్ళి మరోసారి విజయం సాధించి డీకే శివకుమార్ ఐదేళ్ళు సీఎంగా కొనసాగవచ్చు అన్నారు. కాగా అధిష్టానం నుంచి పిలుపుతో సంబంధం లేకుండానే శుక్రవారం హోంమంత్రి పరమేశ్వర్ నేతృత్వంలో పలువురు ఢిల్లీ వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. మహదేవప్ప, హెచ్‌కే పాటిల్, సతీష్‌జార్కిహోళితో పాటు మరో ఇద్దరు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సాధ్యమైనంత త్వరగా అధిష్టానం సమస్యకు చెక్ పెట్టకపోతే గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరి పార్టీ ఉనికికే ప్రమాదంగా మారే అవకాశాలు లేకపోలేదని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రూపు రాజకీయాలు తారస్థాయికి చేరుకోవడంపై పార్టీలు ఆందోళన మొదలయ్యింది. అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

అతివృష్టి బాధిత రైతులకు రూ.1,033 కోట్లు విడుదల

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట కాలంలో అతివృష్టికి దెబ్బతిన్న పంటనష్టంలో భాగంగా రైతుల ఖాతాలకు రూ.1,033.60 కోట్లను సీఎం సిద్దరామయ్య విడుదల చేశారు. అధికారిక నివాసం 'కృష్ణ'లో గురువారం ఉదయం 14.24 లక్షలమంది రైతుల ఖాతాలకు నేరుగా పరిహారాన్ని విడుదల చేశారు. గరిష్టంగా రెండు హెక్టార్లకు పరిమితం అయ్యేలా మెట్టభూముల్లో హెక్టారుకు రూ.8,500 చొప్పున విడుదల చేశారు. సాగుభూముల్లో ఎకరాకు రూ.17వేల రూపాయల చొప్పున విడుదల చేశారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం విడుదల చేసినట్లు సీఎం తెలిపారు. మంత్రులు కృష్ణబైరేగౌడ, సంతోష్‌లాడ్, బోసరాజు, ప్రియాంకఖర్గే, హెచ్‌కే పాటిల్, ఈశ్వర్‌ఖండ్రె తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు సత్కారం

ప్రపంచకప్ భారత మహిళా కబడ్డీ జట్టులో రాష్ట్రం నుంచి పాల్గొన్న ధనలక్ష్మి, చైనాలో జరిగిన ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేత లక్ష్యా రాజేశ్‌కు సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా సత్కరించారు. అధికారిక నివాసంలో క్రీడాకారిణులు ఇద్దరినీ ఘనంగా సత్కరించారు.



క్రీడాకారిణులను సత్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఏనుగుల మందతో బెంబేలు

● ఎత్తిగట్టి సమీపాన రోడ్డు దాటిన 20కిపైగా ఏనుగులు

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లాలో ఇటీవల పులి, చిరుతల సంచారంతో ప్రజలు బెంబేత్తుతున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా 20కిపైగా ఏనుగుల దండు సరిహద్దులోని ఎత్తిగట్టి సమీపాన రోడ్డు దాటడం కలకలం రేపుతోంది. గురువారం ఉదయం ఏనుగులు గుంపుగా ఒక్కసారిగా రోడ్డు దాటుతుండగా వాహనదారులు బెంబేలెత్తారు. ఒక వాహనదారులు తీసిన వీడియో వైరల్ అయ్యింది. భారీ సంఖ్యలో ఏనుగుల సంచారంతో శివారు ప్రాంతాల గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. పంటపొలాలవైపు వెళ్లకుండా వాటిని దట్టమైన అడవుల్లోకి పంపేలా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల అటవీశాఖ అధికారులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.



రోడ్డు దాటుతున్న ఏనుగుల గుంపు

రాజ్యాంగ రక్షణకు సిద్ధమైన యువత

● హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ ● కళాశాలల్లో అవగాహన కల్పించాలని సూచన



విద్యార్థులతో మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించాలనే ధృడ నిశ్చయానికి యువత సిద్ధమైందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సంవిధాన ఓదు (రాజ్యాంగం చదువు) సంస్థ రాష్ట్రస్థాయిలో రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగమోహన్‌దాస్ మాట్లాడుతూ సంవిధాన ఓదు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సంయుక్తంగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారన్నారు. 550మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కళాశాలకు ఇద్దరు చొప్పున మాత్రమే అవకాశం కల్పించారని, రాష్ట్రంలోని ప్రతి జిల్లా నలుమూలలనుంచి విద్యార్థులు వచ్చారన్నారు. రాజ్యాంగంలోని ప్రధానమైన ప్రాథమిక హక్కులు, విధులు, సామాజిక న్యాయం, సెక్యులర్, మహిళా హక్కులు తదితర అంశాలపై పోటీలు జరిగాయన్నారు. ఇప్పటివరకు రాజ్యాంగం పట్ల అవగాహన కల్గిన భిన్నరంగాల నిపుణులు మాత్రమే చర్చిస్తారని భావించామన్నారు. కానీ యువత రాజ్యాంగం గురించి తెలుసుకోవాలనే పట్టుదల, అంతకుమించి తమ అనుభవాలను వ్యాసరచనల రూపంలో రాసేందుకు ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. 2018లో తొలిసారి విద్యార్థులకు అవగాహన కల్పించేలా చైతన్యం కల్పించామని, ఇప్పటివరకు 30లక్షలమందికిపైగా అవగాహన కల్పించామన్నారు. రాజ్యాంగంపై చర్చాగోష్టులు ప్రతి కళాశాలలో జరపాలని భావిస్తున్నామన్నారు. ఆశంబిముల్లా మాట్లాడుతూ సమాజం గురించి తెలుసుకోవాలనే ఆలోచన ప్రశంసనీయమన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీసీ నాగేంద్రకుమార్ పోటీల విధానాన్ని వివరించారు. ప్రథమ బహుమతి బెంగళూరు సిటీ యూనివర్సిటీకి చెందిన మాన్యకు దక్కగా, ద్వితీయ బహుమతి కోలారు డిగ్రీ కళాశాల హర్షితకు, తృతీయ బహుమతి కాడుగూడి గవర్న్‌మెంట్ కళాశాల విద్యార్థిని విభకు దక్కింది. సంవిధాన ఓదు సంచాలకులు రాజశేఖరమూర్తి, కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి, న్యాయవాది శ్రీహరి, రాజుగోరూరు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ యూటీ ఖాదర్‌కు డీ-లిట్ ప్రదానం



స్పీకర్‌కు డీ-లిట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్‌కు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ (డీ-లిట్) గౌరవాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రదానం చేశారు. రాజ్‌భవన్‌లోని బ్యాంకెట్‌హాల్‌లో గురువారం ప్రదానోత్సవం జరిగింది. బెంగళూరు యూనివర్సిటీ 60వ వార్షికోత్సవంలో భాగంగా డీ-లిట్‌ను ప్రకటించారు. అందుకు అనుగుణంగానే జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు యూనివర్సిటీ వీసీ డాక్టర్ జయకర్ ఎస్‌ఎం పాల్గొన్నారు.

అలరిస్తున్న ఫ్లవర్ షో



హంపి రాతిరథం నమూనా వద్ద సెల్ఫీ తీసుకుంటున్న యువతి

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రముఖ ఉద్యానవనమైన కబ్బన్‌పార్కులో ఫ్లవర్‌షో గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. 50వేలకు పుష్పాలను ప్రదర్శనలో వినియోగించారు. లాల్‌బాగ్ తరహాలో ఇక్కడ 11రోజుల పాటు ప్రదర్శన కొనసాగనుంది. పుష్పాల పండుగ 2025 పేరిట ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బాలల దినోత్సవం, కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా పార్కులో ఫ్లవర్‌షోను ఏర్పాటు చేశారు. ప్రముఖ పర్యాటకకేంద్రమైన హంపిలోని రాతి రథం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చేపలు, డాల్ఫిన్స్, సీతాకోక చిలుక వంటి నమూనాల వద్ద ఫోటోలు సెల్ఫీ తీసుకునేందుకు విద్యార్థులు, సందర్శకులు పోటీపడ్డారు. తొలుత పార్కులోని చామరాజేంద్ర ఒడయార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పసుపు, ఎరుపు రంగులతో రూపొందించిన కర్ణాటక మ్యాప్ ఆకర్షణగా నిలిచింది. రెండు డాల్ఫిన్‌ల నడుమ కావేరిమాత విగ్రహం కొత్తదనంతో నిండింది. కాకరకాయ, క్యాప్సికమ్, టమోటాలు, బత్తాయిలతో ఏనుగు నమూనా ప్రత్యేకంగా నిలిచింది. ఫ్లవర్‌షోలో ఏర్పాటైన పుష్పాలు వృథా కాకుండా వాటిని ఎండబెట్టడం, లేదా తిరిగి వినియోగించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ ఆదేశించారు. ప్రదర్శనను ప్రతిరోజూ ఉదయం 6 గంటలనుంచి రాత్రి 7 వరకు వీక్షించే అవకాశం కల్పించారు. ఎంట్రీ ఫీజు పెద్దలకు రూ.50, పిల్లలకు 10 రూపాయలుగా నిర్ణయించారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించారు.



కావేరి విగ్రహం వద్ద..



సీతాకోకచిలుక వద్ద విద్యార్థుల బృందం



పుష్పాల సోయగాన్ని వీక్షిస్తున్న యువతులు



కర్ణాటక మ్యాప్ వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్



కూరగాయలతో ఏనుగు నమూనాను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,528	3,066
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,313	6,246
నీటి నిల్వ (టీఎంసీలు)	72.42	96.00

నేడు ఎంపీ తుకారాం పర్యటన

బళ్లారి సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఎంపీ తుకారం శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టను న్నారు. బళ్లారి శివారులో జాతీయ రహదారి ఎన్‌హెచ్-67 ప్రాజెక్ట్ కింద వేణీవీ రాఫూర్ నుంచి హగరి వరకు నిర్మించిన బైపాస్ రోడ్డును ఆయన ప్రారంభించనున్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని బస్టాండ్ భూమి పూజలో పాల్గొంటారు. జిల్లాఆసుపత్రి, ఎన్‌ఎండీసీ సీఎస్‌ఆర్ 1,200లక్షల గ్రాంటుతో నిర్మించిన ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభిస్తారు. తరువాత యోగా పిరిమిడ్‌ను సందర్శించారు. జిల్లాపంచాయతీ ఆవరణలో విశ్వకర్మ పథకం కింద ఎంపికైన లబ్దిదారులకు కిట్లను పంపిణీ చేస్తారు. తరువాత జిల్లాపంచాయతీ ఆడిటోరియంలో లీడ్ బ్యాంక్ త్రైమాసిక సమావేశంలో ఆయన పాల్గొంటారని ఎంపీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

● అభ్యంతరాలకు డిసెంబరు 10 వరకు గడువు

హోస్పేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాబోయే కర్ణాటక శాసనమండలి ఈశాన్య ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నేపధ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 12న ప్రచురించినట్లు జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ ఓటరు నమోదు అధికారి కవితా ఎస్. మన్నికేరి తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ఓటర్లు పరిశీలించేందుకు సంబంధిత నియోజకవర్గంలోని అన్ని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్టర్ కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్, కమిషన్, మున్సిపల్ కార్పొరేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా జాబితా ఉంటుందని, ఓటర్ల వివరాల్లో ఏవైనా పేర్ల లోపాలు తప్పులు చిరునామా మార్పులు ఇతర అభ్యంతరాలు ఉంటే సంబంధిత డిశంబర్ 10 లోపు ఎలక్టోరల్ రిజిస్టర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సామాజిక మాధ్యమాలతోనే పిల్లల్లో డిప్రెషన్

● బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ కోసంబి ● తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శశిధర్ కోసంబి, వేదికపై ఎస్పీ శోభారాణి, న్యాయాధికారి రాజేష్ ఎన్.హొసమునె తదితరులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బెంగళూరు, చిక్కమంగళూరు, బెళగావి, రాయచూరు, చామరాజనగర్ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణ కమిషన్ జరిపిన సమీక్షలో 99శాతం మంది పిల్లల్లో సామాజిక మాధ్యమాలకు బానిసకావడం ద్వారానే మానసికంగా దృఢత్వం కోల్పోయి డిప్రెషన్‌లోకి వెళ్తున్నట్లు తేలిందని రాష్ట్ర పిల్లల హక్కుల రక్షణా మండలి కమిషన్ అధ్యక్షుడు శశిధర్ కోసంబి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని బీడీ ఏఏ సభాంగణంలో రీడ్స్ సంస్థ, జిల్లా చట్టసేవ ప్రాధికార, జిల్లా పిల్లల రక్షణ విభాగం, సీఏసీఎల్-కె సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన "బాల్యవివాహ అరికట్టే విషయంలో ఎదుర్కొంటున్నసవాళ్ళు, వాటికి అవసరమైన పరిహారాలు" తవిషయంపై ఏర్పాటు చేసిన ఒక రోజు రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ ఆలోచనలు నింపాలని, తరచూ వారి అలవాట్లు, కదిలకలపై నిఘా వహించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం, ఆయా శాఖల ద్వారా అన్ని పనులు నిర్వహించడం సాధ్యం కాదని, సమాజంలో ప్రభుత్వం, సార్వజనిక రంగాల మధ్య వంతెనలా ఉన్న సంఘ సంస్థలు కార్యనిర్వహణ గావించాలన్నారు. వచ్చే 2030 నాటికి బాల్య వివాహ రహిత భారత దేశంగా మార్చేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, సంఘ సంస్థలు, సార్వజనికులు ప్రభుత్వంతో చేతులు కలిపి సహకరించాలని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణదేవి పిలుపు నిచ్చారని, ఆ దిశలో ప్రతి ఒక్కరు బాల్యవివాహ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చట్టసేవ ప్రాధికార మెంబర్ సెక్రటరీ, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమనె మాట్లాడుతూ, రాష్ట్రంలో 60వేల మంది బాల్య వివాహ నిషేదాధికారులు ఉన్నారని, అంటే సుమారు జిల్లాకు 2వేల మంది అధికారులు ఉన్నా దురాచారాలు జరగడం శోచనీయమన్నారు. ఈ విషయంపై ప్రతిఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యకోసం అనేక పథకాలు రూపొందించిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోని జ్ఞానాభివృద్ధి సాధించాలన్నారు. చదువుకునే వయస్సులో ప్రీతి, ప్రేమ అంటూ సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులు కారాదని హితువు పలికారు. సామాన్యంగా పిల్లలు తప్పులు చేయడం సహజమని, దానిని సరిదిద్దుకుని ఆదర్శవంతమైన జీవనం రూపొందించుకుని ముందు సాగాలని, చిన్న వయస్సులో తప్పులు చేస్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బళ్లారి నగర డీవైఎస్పీ పోలీసు అధికారి చంద్రకాంత్ నందా రెడ్డి, జిల్లా పిల్లల రక్షణా విభాగం అధికారి సుభద్రాదేవి, రీడ్స్ సంస్థ కార్యకరాని సమితిసభ్యులు హనుమంత రెడ్డి, స్వయం సేవా సంస్థప్రముఖులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఈని పకడ్బందీగా అమలు చేయండి : కమిషనర్

బళ్లారి సిటీ(ఆంధ్రజ్యోతి): జిల్లాలోఉచిత, నిర్బంధ విద్యాచట్టాన్ని చిత్తశుద్దితో అమలు చేయాలని కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ శశిధర్ కోసాంబే అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో గురువారం జిల్లాలో ఆర్టీఈ చట్టం అమలుపై విద్యాశాఖ, తాలూకాస్థాయి అధికారులతో జరిగిన ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత నిర్బంధ విద్యా చట్టం 6నుంచి 14సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలందరికీ వర్తింపచేయాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. 2021-22 లో జిల్లాలో కరోనా కాలంలో పిల్లలకు పోషకాహారం అందించడానికి ప్రభుత్వం నిధుల దుర్వినయోగంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలోని అన్నిపాఠశాలల ఖాతాల్లో మొత్తం రూ. 2,24,71,138 ఉన్నట్లు వేడి భోజన పథకం అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ ఈ డబ్బు పిల్లలకు చేరాలి లేదా ప్రభుత్వానికి చేరాలన్నారు ఈసమావేశంలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ త్రివేణిపత్తార్, జిల్లా బాలల రక్షణ అధికారి సుభద్రాదేవి, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా బాలల రక్షణ యూనిట్‌సభ్యులు చెట్లవెంకటేశ్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అసౌకర్యాలపై కమిషనర్ ఆగ్రహం



భోజనం రుచి చూస్తున్న కమిషనర్

ప్రభుత్వ హాస్టళ్లో చదువుకుంటున్న విద్యార్థినులు ఏవైనా సమస్యలు తలెత్తితే 1098కు ఫోన్ చేస్తే అధికారులు స్పందించి సమస్యను పరష్కరిస్తారని రాష్ట్ర పిల్లల హక్కుల కమిషన్ అధ్యక్షుడుశశిధర్ కోసంబి విద్యార్థుల్లో ధైర్యం నింపారు. గురువారం జిల్లాలో పలు హాస్టళ్లను పరిశీలించిన ఆయన సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి వ్యవస్థ, హాస్టళ్ళ పరిసరాల శుభ్రత గురించి వార్డెన్‌పై మండిపడ్డారు. నగర శివారు ప్రాంతంలోని మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొరార్జీ వసతి పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న భోజనం, సౌకర్యాలను పరిశీలించారు. మహిళా ఖైదీలు ఉంటున్న విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కారాగారం సూపరెంటెండ్ లతా, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు, జిల్లా సర్జన్ డాక్టర్ బసరెడ్డి, జిల్లా నిరూపణాధికారి సవితా, వెనుకబడన వర్గాల సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా పిల్లల రక్షణ విభాగం అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సెషన్స్ కోర్టు న్యాయాధికారి కేజీ శాంతి

రాజ్యాంగం.. పవిత్ర గ్రంథం

భారతీయులందరూ గౌరవించాలి: న్యాయాధికారి శాంతి

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతిపెద్ద బలమైన, అత్యంత శక్తివంతమైన లిఖిత రాజ్యాంగం కలిగిన దేశం మనదని, రాజ్యాంగం భారతీయులకు పవిత్ర గ్రంథమని జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి, జిల్లా చట్టసేవ ప్రాధికార అధ్యక్షులు కె.జి.శాంతి పేర్కొన్నారు. నగరంలోని తాళ్లూరు రోడ్డులో నూతన కోర్టు భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా న్యాయ విభాగం, జిల్లా చట్ట సేవల ప్రాధికార ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రాజ్యాంగ దినోత్సవం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మనవతా సమానులు, ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యం తెలుసుకుని దేశ భద్రతపై ఆలోచించాలన్నారు. జీవితాన్ని గడపవచ్చని, దేశ ఐక్యత, సమగ్రత గౌరవాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. రాజ్యాంగ మహత్యం, దానిని రచించిన రచనకారులను ఆధునిక భారత పౌరులకు వారిగురించి తెలియజేయాలని, రాజ్యాంగ్యాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను గౌరవించాలన్నారు. మన రాజ్యాంగం లిఖిత రూపంలో ఆంగ్లభాష, హిందీ రెండు భాషల్లో చేతిరాతతో కూడిన క్యాలిగ్రఫీలో ఉందని, దీని మూల ప్రతులను ప్రేమ్ బిహారి నారాయణ రైజాదా దేవనాగరి లిపిలో రాశారని, ఆచార్య నందలాల్‌బోస్ నేతృత్వంలో శాంతినికేతన కళాకారులు రాసిన చేతిరాత ప్రతులు ప్రస్తుతం లోక్‌సభ గ్రంథాలయంలో ఉన్నాయన్నారు. రాజ్యాంగంలో రాజనీతి, ప్రాథమిక విధులు, న్యాయ వ్యవస్థ, స్వేచ్ఛ, సమానత్వం, విద్య, భారతీయ పౌరుడి విధులు, ఇతరత్ర అంశాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. 2002 సంవత్సరంలో అనే చట్టాలు రూపొందించబడ్డాయని, వాటిలో దేశబలం, ఆస్తిగా పిల్లలను పెంచడం తల్లితండ్రుల విధి అని, వారికి తప్పకుండా విద్యను అందించడం తప్పని సరిగా ఉందని చట్టంలో ఉందన్నారు. రాజ్యాంగ సగ్రమ సచారాన్ని అందించి, రాజ్యాంగ ప్రవేశికను చదవడం ద్వారా భారత పౌరులుగా మన బాధ్యతలు ఏమిటో అర్థం చేసుకోవచ్చని ఆమె వివరించారు. ఇదే సందర్భంలో న్యాయమూర్తి కె.జి.శాంతి రాజ్యాంగ ప్రతిజ్ఞను న్యాయమూర్తులు, న్యాయవాదుల చేత చేయించారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సివిల్ జడ్జి రాజేష్ ఎన్.హొసమనె, అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.బి.ప్రమోద్, అడిషనల్ జిల్లా సెషన్స్ న్యామూర్తి రాఘవేంద్ర గౌడ, 4వ అడిషనల్ జిల్లా జడ్జి రాధా కాంత్ గుడి, సిజెఎం సీనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం ఎం. ముజావర్, 2వ అడిషనల్ సివిల్ న్యాయమూర్తి వినుతా బి.ఎస్. 3వ అడిషనల్ సవిల్, జెఎంఎఫ్‌సి న్యాయమూర్తి ముదుకప్ప ఓడస్, 2వ సీనియర్ సివిల్ జడ్జి నస్రత్ ముక్తార్ అహ్మద్ ఖాన్, సివిల్, జెఎంఎఫ్ న్యాయమూర్తి నాగేష్ నాయక్, 1వ అడిషనల్ సివిల్, జెఎంఎఫ్ కోర్టు న్యాయమూర్తి సిద్దలింగయ్య, గంగాధర మఠలతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని వినతి



జడ్పీ సీఈఓ హారీస్‌కు వినతి పత్రం అందజేస్తున్న వేదిక సభ్యులు

బళ్లారి సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బి.గోనాల్ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కర్ణాటక దళిత రక్షణ వేదిక సభ్యులు జిల్లా కమిటీ జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు శంకర్ నందిహాళ్, హనుమేశ్ కట్టిమని మాట్లాడుతూ పాఠశాలలో 160మంది విద్యార్థులు చదువుతున్నా సరైన సౌకర్యాలు లేవన్నారు. ఆగష్టు నెలలో విపరీతమైన వర్షం కారణంగా పాఠశాల ప్రహరీ కూలి పోయిందన్నారు. ఆట మైదానం, బాలికలకు,బాలురకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మించాలని కోరారు. నీటి పంపు నిర్మించాలని, నీటి ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. ఈసందర్భంగా మానయ్య, బి.గోపాల్ తదితరులున్నారు.

ఇకపై ఇళ్ల వద్దకే పోలీసులు : డీవైఎస్పీ

గంగావతి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇకపై ప్రజల వద్దకే పోలీసులు చేరకుంటారని నగర డీవైఎస్పీ జె.ఎస్. న్యామగౌడ్ తెలిపారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులు, పెద్దలు, యువకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి పోలీసులు ప్రజల ఇంటి వద్దకు చేరుకుని ప్రజల సమస్యలు పరిష్కరిస్తారన్నారు. పోలీసులంటే భయపడాల్సి అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలు, అన్యాయాలు, ఫిర్యాదులను ఎలాంటి భయం లేకుండా నేరుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి డాక్టర్ పరమేశ్వర ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పీఎస్‌ఐలు ప్రకాష్ మాలి, టీ.జీ నాగరాజ్ తదితరలు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి



సమావేశంలో బళ్లారి రైల్వే కమిటీ సభ్యులు

బళ్లారి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లో సమస్యలు, రైళ్ల రాకపోకల్లో ఇబ్బందులను పరిష్కరించాలని బళ్లారి రైల్వే అభివృద్ధి సభ్యులు కోరారు. గురువారం హుబ్లీలో డీఆర్ఎం బైల మీనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు ఆర్ గోపాలకృష్ణ, సొంత గిరిధర్ కొట్రేష్, రాహుల్ మెహతా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బళ్లారి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పురోగతి హైదరాబాద్ రైలు సేవలను ప్రతినిత్యం పునఃప్రారంభించాలని ముంబై, హొస్పేట నుంచి బళ్లారి వరకు కనీసం రెండుసార్లు నడపాలన్నారు. డీఆర్‌యూసీసీ మీటింగ్‌లో రైల్వే సమితి సభ్యులు పలు ఉన్నతాధికారులకు తెలిపి ప్రయాణికులకు నిత్యం అనుకూలంగా ఉండేలా చూడాలని టీఆర్ఎస్ బైల మీనాకి పలు సూచనలు రైల్వే అభివృద్ధి పట్ల పలు విషయాలు తెలియజేశారు.

1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

బళ్లారి సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి రాజేశ్ హొసమనె తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన కార్యక్రమాన్ని బెంగళూరులోని రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంఘం, జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, జిల్లా న్యాయసేవల అథారిటీ , సమాచార ప్రజసంబంధాల విభాగం, పోలీసు శాఖ, జిల్లాఆసుపత్రి , జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం ఆసుపత్రి వరణలోవాక్‌థాన్ నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లాక్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా సర్జన్ బసారెడ్డి, డాక్టర్ పూర్ణిమ కట్టిమణి, ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, ఎఫ్‌పీఏఐ మేనేజర్ విజయలక్ష్మి, నిత్యజీవన్ సంస్థ అధ్యక్షురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

రేషన్ దుకాణం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ 24వ వార్డులోని మారియమ్మన్ ఆలయం సమీపంలో ఎమ్మెల్యే అభివృద్ధి నిధి నుంచి రూ.8 లక్షల వ్యయంతో కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్ పనులను ప్రారంభించారు. మేయర్ సత్య ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, రాష్ట్ర కళలు, సాహిత్యం మండలి ఉప కార్యదర్శి మాదేశ్వరన్, కార్పొరేషన్ కౌన్సిలర్ గిరి, మున్సిపల్ ఏరియా కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఉదయనిధి స్టాలిన్ జన్మదిన వేడుకలు



మత్తిగిరిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని మత్తిగిరిలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ జన్మదిన వేడుకలను అభిమానులు సంబరంగా ఆచరించారు. కేక్ కట్ చేయడమే కాక బిర్యానీని పంపిణీ చేయడంతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. తమిళనాడు ఉపముఖ్యమంత్రి, డీఎంకే యువజన కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ 49వ పుట్టినరోజు సందర్భంగా డీఎంకే తరపున సభ్యులు తమిళనాడు అంతటా సంబరాలు చేశారు. మత్తిగిరి బస్టాండులో ఆదిద్రావిడ వెల్ఫేర్ కమిటీ జిల్లా డిప్యూటీ ఆర్గనైజర్ ఎడ్విన్ రాజ, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ టీం సూర్య, దినేశ్ కుమార్ నేతృత్వంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి హోసూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, రాష్ట్ర కళా, సాహిత్య మండలి డిప్యూటీ కార్యదర్శి మాదేశ్వరన్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై కేక్ కట్ చేశారు. ప్రజలకు బిర్యాని వడ్డించారు. వెయ్యి మందికి పైగా స్థానికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాలను జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కుమార్, క్రీడా అభివృద్ధి బృందం సూర్య, హుస్సేన్, 45వ వార్డు సర్కిల్ బ్రాంచ్ కార్యదర్శి మనోహరన్ నిర్వహించారు. కార్యక్రమంలో నగర మండలి ఉప కార్యదర్శి రవికుమార్, ఏరియా కార్యదర్శి రాజా, గుణ, సంధ్య, అఖిల్, ఆనంద్ తదిరులు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రించాలని డిమాండ్

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు-కర్ణాటక సరిహద్దులోని హోసూరులో ఇటీవల నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కర్ణాటకకు చెందిన అనుమానిత వ్యక్తులు హోసూరు ప్రాంతంలో దొంగతనాలు చేసి పారి పోతున్నారు. పోలీసులు ఎంత నిఘా ఉంటున్నా నేరాలు తగ్గడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి హోసూరులోని కృష్ణనగర్ 11వ వీధిలో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్న సీసీటీవి ఫుటేజీలు తాజాగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు తరచుగా దొంగిలించబడుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ సీసీ టీవి ఫుటేజీ ఆధారంగా స్థానికులు హోసూరు సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు, ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు కూడా ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. అందువల్ల ఈ ప్రాంతంలో గస్తీని ముమ్మరం చేయాలని పోలీసులు కోరుతున్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం

హోసూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు వసంత్‌నగర్‌లోని ప్రసిద్ధ పర్వతవర్ధిని అమ్మన్ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అష్టబంధన మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం గణపతి హోమం, యాగాశాల పూజలు, పవిత్ర జలాలతో కూడిన కళశాలకు విశేషపూజలు చేశారు. వేద మంత్రోచ్చారణతో విమాన గోపురానికి కుంభాభిషేకం నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆనందయ్య, బీజేపి నాగరాజు, మాజీ కౌన్సిలరు నంద కుమార్, డెంకణీకోటకు చెందిన అన్నాడీఎంకే నేత నాగేశ్ సహ పలువురు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



విశేష పూజల్లో భక్తులు

హాస్టల్ భవనానికి కమిషనర్ భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కమిషనర్ మంజునాథ్

బళ్లారి సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని రావు బహద్దూర్ వై మహాబలేశ్వరప్ప టెక్నికల్ కాలేజ్ ఆర్.వై.ఎం.ఈ.సీ విద్యార్థుల కోసం నిర్మించనున్న హాస్టల్ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంజునాథ్ మాట్లాడుతూ ఈకొత్త హాస్టల్ భవనంతో విద్యార్థులకు ఎంతో సౌకర్యం లభించనుందన్నారు. విద్యార్థులు మన దేశ పురోగతికి రేపటి సమస్య పరిష్కారాలకు రూపశిల్పులు. విద్యాపరంగా, సాంస్కృతికంగా సామాజికంగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా వీవీసంఘం అధ్యక్షుడు కణేకల్ మహంతేశ్, జానకుంటే బసవరాజ్, కార్యదర్శి అరవింద్ పటేల్, పంపనగౌడ, కోశాధికారి బైలువద్దిగేరి ఎర్రిస్వామి, ప్రభుస్వామి, శేఖర్, మల్లనగౌడ, కోరి విరూపాక్షప్ప, చంద్రశేఖర్, అల్లం ప్రమోద్,టి.కొట్రప్ప చోరనూరు, మల్లికార్జున, ప్రిన్సిపాల్ హనుమంతరెడ్డి,వైస్.ప్రిన్సిపాల్ సవితా సోనోలి. ఆర్ఎంఈసీ, సిబ్బంది రుద్రయ్య. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎండీసీ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



ఎన్‌ఎండీసీ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సండూరు ప్రాంతం లో ఉన్న ఎన్‌ఎండీసీ ప్లాంట్, బెనిఫికేషన్ ప్లాంట్లలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పనుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎన్‌ఎండీసీ ప్రధాన ద్వారం వద్ద ఏఐయుటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంయుక్త గణి కార్మికుల సంఘం కార్యాధ్యక్షుడు కామ్రేడ్ దేవదాస్ మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులు పనులు పోగొట్టుకుని 10 రోజులైందని, ఎన్‌ఎండీసీ పాలనా మండలి కొత్త కాంట్రాక్టర్లును బాధ్యతలు అప్పగించి తప్పుకోవడం సరికాదన్నారు. కార్మికులపై ఫ్యాక్టరీ యాజమాన్యం వివక్ష చూపడం సరికాదన్నారు. పదేళ్ల నుంచి పని చేసే వారిని తొలగించడం సరికాదన్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టరు తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ ఈ.తుకారంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సోమశేఖర్ గౌడ, సంయుక్త గనుల కార్మిక సంఘం కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ పాల్గొన్నారు.

కుడితినిలో నీటి సమస్య పరిష్కరిస్తాం: ఎంపీ



కుడితిని చెరువును పరిశీలిస్తున్న ఎంపీ తుకారాం

కంప్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితినిలో రిజర్వాయరు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని ఎంపీ ఈ తుకారాం అన్నారు. గురువారం కుడితినిలో ఆయన ఆకస్మికంగా చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుంగభద్ర డ్యామ్ నుంచి బళ్లారికి వెళ్లే పైపులైన్‌కు లింక్ కలిపి నీటి సమస్య తీరుస్తామన్నారు. కుడితినిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. వీరితో పాటు తహసీల్దార్ రేఖ పట్టణ పంచాయతీ ఇన్‌చార్జ్ ముఖ్య అధికారి మంజునాథ్, జేఈ శారద, శివలింగప్ప మాజీ స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్, మాజీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి వెంకటరమణ బాబు, కేఎస్ఎల్ స్వామి, ఏకాంబరం, వీకేసీ చంద్రప్ప, మాంతేష్, వీఏవో గ్రామస్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

సిరుగుప్ప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ ఆరిఫ్ సునైర్ తాలుకాలోని నడివి ప్రభుత్వ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. వంటగదులను పరిశీలించిన ఆయన సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. నేటిరోజుల్లో విద్యాప్రగతి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, వంట సహాయకులు విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి గుర్రప్ప, పంచాయతీ ఈవో పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పేట బసవేశ్వరుడికి కలశధారణ

కంప్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కంప్లిలో పేట బసవేశ్వరుడు, నీలమ్మ రథోత్సవం గురువారం కలశధారణ, కంకణధారణతో పాటు పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన లీలా విభాగంలో బసవన్న కలశధారణను పట్రయ్యస్వామి రూ. 26,511, నీలమ్మ కలశధారణను మఫత్‌లాల్ రూ. 23,001, బసవన్న, నీలమ్మ కంకణధారణను వాలి కొట్రప్ప రూ. 20,101 భక్తి సేవగా పాడారు. ఆలయ నిర్వహణ బోర్డు అధ్యక్షుడు డీ వీరప్ప, ధర్మకర్త యు ఎం విద్యాశంకర్, సభ్యులు చౌకీన్ సతీష్, మన్నూరు శరణప్ప, కంప్లిలో పేట బసవేశ్వరస్వామి, నీలమ్మల రథోత్సవం సందర్భంగా కలశాలకు పూజలు చేశారు. జడెయ్యస్వామి, శిందకంటి శివమూర్తిస్వామి, బండెయ్యస్వామి, ఎస్ మంజునాథ్, అరవి అమరేష్, మన్నూరు నవీన్, నందికోలు శివప్రసాద్, బి శివానంద, వాలి కొట్రప్ప, కల్లుడి విశ్వనాథ్ పాల్గొన్నారు.




ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఎంఎం కలబుర్గి (జయంతి)



హంపిలోని కన్నడ విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించిన ప్రముఖ కన్నడ విద్వాంసుడు మల్లేశప్ప మడివాళప్ప (ఎంఎం) కలబుర్గి 1938 నవంబరు 28న విజయపుర జిల్లా సిందగి తాలూకా గుబ్బేవాడ గ్రామంలో జన్మించారు. రచయిత, చరిత్రకారుడు, శాసనకారుడు, 'కన్నడ'లో వచన సాహిత్యంలో పండితుడు. పీహెచ్‌డీ చేశారు. 103 పుస్తకాలు, 400కుపైగా వ్యాసాలు రాశారు. కర్ణాటక ప్రభుత్వంచే ముద్రితమయ్యే 'సమగ్ర వచన సంపుట'కు ప్రధాన సంపాదకులుగా వ్యవహరిం చారు. కన్నడ సాహిత్య అకాడమీ, నాడోజ, నృపతుంగ, పంప, బసవ, రాజ్యోత్సవ పురస్కారం ఇతర అవార్డులు పొందారు. 2015 ఆగస్టు 30న హత్యకు గురయ్యారు.

టోమీ ఉంజెరెర్ (జయంతి)



ఫ్రాన్స్ దేశ రచయిత, నటుడు జీన్ థామస్ టోమీ ఉంజెరెర్ 1931 నవంబరు 28న స్ట్రాస్‌బర్గ్‌లో జన్మించారు. రచయిత, నటుడు. పిల్లలకు సంబంధించిన అంశాలపై ఇల్లుస్ట్రేటర్‌గా రాణించారు. 140కుపైగా రచనలు చేశారు. అంతర్జాతీయస్థాయిలో పేరొందిన 'హన్స్ క్రిస్టియన్ అండర్సన్ మెడల్'ను పొందారు. జీవిత సాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. ఫ్రాన్స్ దేశంచే 'లెజియన్ ఆఫ్ హానర్' పొందారు. 2019 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

ఎనిడ్ మేరి బ్లైటన్ (వర్ధంతి)



ఎనిడ్ మేరి బ్లైటన్ 1897 ఆగస్టు 11న లండన్‌లో జన్మించారు. పిల్లలకు సంబంధించిన అంశాలు, విద్య, ఫాంటసీ, మిస్టరీలపై ఆమె ఎన్నో రచనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 90కుపైగా భాషలలో తర్జుమా కావడం ద్వారా ఎంతగా ప్రభావితం చేశారో అర్థం చేసుకోవచ్చు. 1930 నుంచి 600 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడయ్యాయి. 'నోడీ, ఫేమస్ ఫైవ్, మలోరి టవర్స్, సీక్రెట్ సెవెన్' సిరీస్ ఎంతో పేరొందాయి. 1968 నవంబరు 28న కన్నుమూశారు.

డెకాథ్లాన్ శాఖ ప్రారంభం



శాఖ ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైట్‌ఫీల్డ్‌లోని అతిపెద్ద షాపింగ్‌మాల్ డెకాథ్లాన్ ఆధునీకరించుకుంది. 60వేల చదరపు అడుగులలో విస్తరించిన మాల్‌లో అన్నిరకాల స్పోర్ట్స్ పరికరాలు ఇక్కడ లభ్యమవుతాయి. నగరంలోని క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం కానుంది. ఆధునీకరించుకున్న డెకాథ్లాన్ మాల్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, స్కేటింగ్, పికల్‌బాల్, జిమ్నాస్టిక్స్‌లో పిల్లలు, పెద్దలకు కోర్సులు, వర్క్‌షాప్‌లకు ఇక్కడ అవకాశం కల్పించారు. చిల్డ్రన్స్‌జోన్, యోగా, నృత్య స్టూడియోలు ఉన్నాయి. ప్రత్యేకించి ప్రతివారం సైక్లింగ్, రన్నింగ్ గ్రూప్ మీటింగ్, క్రీడాకారులకు జన్మదిన పార్టీలు, వివిధ క్రీడా పోటీల వర్క్‌షాప్‌లకు అవకాశం ఉందని సంస్థ ఇండియా సీఈఓ సంకర్ ఛటర్జీ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో అన్ని వర్గాల అభివృద్ధికి సరిసమానంగా రాశారని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. బుధవారం సిరుగుప్ప పట్టణం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన భావచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన రహదారిలో ఊరేగించారు. హైస్కూలు గ్రౌండ్‌లో వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజ్యాంగంలో అన్ని వర్గాల అభివృద్ధిపై స్పష్టంగా వ్రాశారని ఆయన తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘీకంగా రాజ్యాంగం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌసియా బేగమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు కొడ్లి మల్లికార్జున, తాలుకా సాంఘీక, సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరోజీ ఎన్నికలు..

కంప్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దరోజీ ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్షులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గతంలో ఉన్న అధ్యక్షులు మంజునాథ్ తమ పదవికి రాజీనామా చేయడంతో ఆస్థానానికి బుధవారం ఎన్నిక జరిగింది. సభ్యులు గాను, పీఎస్ లింగప్ప ఒక్కరే ఆస్థానానికి నామినేషన్ వేశారు. ఎవ్వరూ ఫోటో లేనందువలన పీఎస్ లింగప్పనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి నాగరాజు తెలిపారు. అనంతరం పీఎస్ లింగప్ప మాట్లాడుతూ సొసైటీలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చేపడతామన్నారు. ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. అనంతరం లింగప్పకు పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వలి మసీదు కార్యదర్శి మల్లికార్జున, జనార్దన్, మాదాపూర్, మారెప్ప, సద్దాం తిమ్మరాజు, సోమశేఖర్, అంబన్న, రవి, రాముడు, రవి ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును ఉత్తమంగా రూపొందించుకోండి

» రేవా స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివరాజ్ పాటిల్



పట్టాలు ప్రదానం చేస్తున్న చాన్స్‌లర్ డాక్టర్ పి. శ్యామరాజు, వేదికపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివరాజ్ పాటిల్

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సహా పలు కోర్సులు పూర్తి చేసుకుని పట్టాలు పొందిన విద్యార్థులు భవిష్యత్తును ఉత్తమంగా రూపొందించుకోవాలని సుప్రీం మాజీ జస్టిస్ శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. రేవా యూనివర్సిటీలో గురువారం పదో స్నాతకోత్సవం జరిగింది. 3,409 డిగ్రీ, 1194 పీజీ, 77 పీహెచ్‌డీలను, వీరిలో 70మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. రేవా చాన్స్‌లర్ శ్యామరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థులు మూడు ప్రశ్నలు వేసుకోవాలని భవిష్యత్తు ఏమిటి? ఇంకా ఏమైనా సాధించాల్సింది పెండింగ్‌లో ఉందా, అదనంగా ఏం అవసరం అనేది నిర్ధారించుకోవాలన్నారు. ఈ ప్రశ్నలు కుతూహలమే అయినా మహత్తరమైన భవిష్యత్తుకు మార్గనిర్దేశకం కావాలన్నారు. ప్రపంచంలో మార్పు తీసుకురావడానికి ఈ గుణాలు కీలకమన్నారు. హార్డ్‌వర్క్, హానెస్టీ, హ్యూమిలిటీ (వినమ్రత)లు ముఖ్యమన్నారు. కులపతి డాక్టర్ పీ శ్యామరాజు మాట్లాడుతూ విద్యార్థులు విశ్వాసంతో కూడిన నాయకత్వం, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. రేవాలో కేవలం విద్య మాత్రమే కాకుండా జీవితపాఠాలను నేర్పుతామన్నారు. ఎడ్యుకేట్ టు ఎంటర్‌ప్రైజెస్ మా నినాదం అన్నారు. పరిశోధనలవైపు యువ విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రేవాలో క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రొ-చాన్స్‌లర్ ఎస్ రాజు, ఉపకులపతి సంజయ్ ఆర్ చట్నీస్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం ధనంజయ, రిజిస్ట్రార్ డాక్టర్ వీణా జితోపాటు ట్రస్టు సభ్యులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

బూదికోటెలో కన్నడ రాజ్యోత్సవం



ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

బంగారపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఏ ఇతర రాష్ట్రానికి లేని విధంగా నాడధ్వజ, నాడగీతె ఉండడం మన కర్ణాటక ప్రత్యేకత అని నవకర్ణాటక స్వాభిమాన వేదిక సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు రామాంజినప్ప తెలిపారు. తాలూకాలోని బూదికోటె గ్రామంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయ ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మన పూర్వీకులు కన్నడభాషను పెంచిపోషించారని, ప్రస్తుత యువత కూడా భాష సంరక్షణకు పాటుపడాలన్నారు. కన్నడ కార్యక్రమాల్లో ప్రజలు ఎక్కువగా పాల్గొనడం ద్వారా కన్నడకు గౌరవం దక్కుతుందన్నారు. రానున్నరోజుల్లో నాడహబ్బను మరింత వైభవంగా ఆచరిద్దామన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతి విద్యార్థి కూడా ఐఏఎస్, కేఏఎస్ వంటి పోటీపరీక్షల్లో తలపడాలన్నారు. ఉన్నత హోదాలలో రాణించి తల్లిదండ్రులకు, కోలారు జిల్లాకు కీర్తి తేవాలన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీలో ఎక్కువమార్కులు సాధించిన విద్యార్థులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు బీఆర్ మంజునాథ్, వీఎస్ఎస్ఎన్ ఉపాధ్యక్షుడు రమేశ్, మాజీ ఉపాధ్యక్షుడు మురుగన్, నవ కర్ణాటక స్వాభిమాన వేదిక తాలూకా అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు బీఎస్ నారాయణచారి, మాజీ సైనికుడు ఆనందప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాల కూల్చివేతను పరిశీలిస్తున్న కమిషనర్ చలపతి

చింతామణి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఆర్ లే అవుట్‌లో అక్రమ నిర్మాణాలను నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి ఆధ్వర్యంలో తొలగించారు. రాఘవేంద్ర ఆలయం వెనుకభాగాన ఒక రోడ్డులో ఇంటి యజమాని దుకాణాలు నిర్మించి బాడుగకు ఇచ్చారు. ఇక్కడ ఒక దుకాణంలో ద్విచక్రవాహనాలు రిపేరీ చేస్తారు. రిపేరీకి వచ్చే వాహనాలను ఇంటి గోడ పక్కన ఆపుతున్నారనే అంశంపై గొడవ తలెత్తింది. దీంతో అంగడి ముందున్న ఇంటి యజమాని రోడ్డును ఆక్రమించి ఒక గోడను సైతం నిర్మించారు. దీంతో ఈ మార్గంలో సంచారానికి సమస్య ఏర్పడింది. ఈ అంశంపై నగరసభ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో ఆయన స్వయంగా పరిశీలించారు. అక్రమ నిర్మాణాలను పొక్లైనర్‌తో తొలగించారు. అంతేకాకుండా అంగడి ముందుభాగాన డ్రైనేజీ, రోడ్డు వరకు అమర్చిన నిర్మాణాలను సైతం తొలగించారు. కాగా రోడ్డును ఆక్రమించి మూడు అంతస్తులకు మెట్లు నిర్మించడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగింపచేశారు. పట్టణంలో రాజకాలువ, రోడ్డు, డ్రైనేజీలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే తొలగించడమే కాక చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.



బెంగళూరు డబుల్ రోడ్డులో చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఫుట్‌పాత్‌కు అడ్డుగా ఉన్న చెట్లు సైతం..

పట్టణంలోని బెంగళూరు డబుల్ రోడ్డులో ఫుట్‌పాత్‌లకు అడ్డుగా ఉన్న విద్యుత్‌స్తంభాలను తొలగించిన నగరసభ ప్రస్తుతం డ్రైనేజీ, ఫుట్ పాత్‌లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే ప్రక్రియ చేపట్టింది. చాలామంది ప్రయాణీకులు ఇక్కడి చెట్లకింద ఉదయం వేళల్లో బైక్‌లను పార్క్ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి రాత్రి వాపసు వచ్చి బైక్‌పై వెళ్లేవారు. రెండురోజులుగా వాహనాలను ఇష్టం వచ్చినట్టు పార్కింగ్‌కు చేసేందుకు వీలు లేదంటూ సదరు వాహనాలను నగరసభ, పోలీసుశాఖలు టోయింగ్ చేస్తున్నాయి. తాజాగా చెట్ల కొమ్మలను, చెట్లను క్రేన్‌ల సాయంతో తొలగించడం విమర్శలకు కారణమవుతోంది.

రైతులు, సైనికుల సేవలపై చైతన్యం

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో కాపలా కాసే సైనికుల దేశభక్తి, రాష్ట్రానికి అన్నం పెట్టే రైతుల త్యాగాలను స్మరించేలా విశ్వవిద్యాపీఠం గ్రూప్ సంస్థల ఆవరణలో జై జవాన్ జై కిసాన్ పేరిట ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమం గురువారం ఏర్పాటైంది. మూడురోజులపాటు కొనసాగనుంది. లాల్‌బహదూర్ శాస్త్రి చారిత్రాత్మక నినాదం 'జై జవాన్ జై కిసాన్' ఆశయం నేటి యువతలో చిగురిస్తోందన్నారు. సిరిధాన్యాల ద్వారా చైతన్యం కల్పిస్తూ పేరొందిన డాక్టర్ ఖాదర్‌వలి, కార్గిల్ యుద్ధవీరుడు, పరమవీర చక్ర పురస్కార గ్రహీత కెప్టెన్ యోగేంద్రసింగ్ యాదవ్, కల్నల్ జైశంకర్‌బాబు, సీబీ మహేశ్వరప్ప ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులను ఎడ్లబండిపై వేదిక వరకు తీసుకురావడం విశేషం. పాఠశాల డైరెక్టర్ సుశీలా సంతోష్ మాట్లాడుతూ వీరభూమి, కృషి జ్ఞానయాత్ర కార్యక్రమాలతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వేదికపై డాక్టర్ ఖాదర్‌వలి, పరమవీర చక్ర పురస్కార గ్రహీత కెప్టెన్ యోగేంద్రసింగ్ యాదవ్, ఎమ్మెల్యే విశ్వనాథ్ తదితరులు

దొమ్మసంద్ర గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా రాజణ్ణ ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడు రాజణ్ణకు సన్మానం

దొమ్మసంద్ర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షులుగా ఎం రాజణ్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదివరకు అధ్యక్షులుగా కొనసాగిన నరేశ్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి గురువారం ఎన్నికలు జరిగాయి. ఎం రాజణ్ణ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఆనేకల్ తాలూకా బీఈఓ గురుమూర్తి ప్రకటించారు. గ్రామపంచాయతీలో 32మంది సభ్యులకుగాను 24 మంది ఎం రాజణ్ణకు మద్దతు ఇవ్వడంతో మెజారిటీతో అధ్యక్షులుగా గెలుపొందారు. అనంతరం రాజణ్ణ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాలతోపాటు సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. సభ్యులందరి సహకారంతో పారదర్శక పాలన అందిస్తానన్నారు. ఉపాధ్యక్షులు గిరిజ, మాజీ అధ్యక్షుడు ఉమేశ్‌బాబు, గ్రామపంచాయతీ సభ్యులు డీఎస్ నాగరాజు, నారాయణప్ప, సురేశ్, కే మోహన్‌బాబు, నరేశ, ప్రభాకర్, పీడీఓ జ్యోతి, కార్యదర్శి మంజునాథరెడ్డి, యమరె గ్రామపంచాయతీ సభ్యుడు సంపంగి, చంబేనహళ్ళికి చెందిన మణి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కలిగ సంఘం పదాధికారులు ఏకగ్రీవం

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఒక్కలిగ సంఘం చరిత్రలో ఇదే తొలిసారి అధ్యక్షుడు సహా పదాధికారులంతా ఏకగ్రీవమయ్యారు. ఈనెల 23న సంఘం 35మంది కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసారి గ్రూపులు, వర్గాలు పోటీలేకుండా ఎన్నిక కావడం విశేషమని సంఘం అధ్యక్షుడు ఎల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక్కలిగ నాయకుడు డీసీఎం డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి అవకాశం కల్పించాలన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి డీకే శివకుమార్ ఎంతో కృషి చేశారన్నారు. ఇటీవల మీడియాలో ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందన్న కథనాలపై స్పందిస్తూ నాయకత్వ మార్పు అనివార్యమైతే డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఇందుకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సహకరించాలని కోరుతున్నామన్నారు.



పదాధికారులతో ఒక్కలిగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు

19న తాలూకాస్థాయి ఉద్యోగమేళా

» ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు

దొడ్డబళ్ళాపుర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాస్థాయి ఉద్యోగమేళాను పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఆవరణలో డిసెంబరు 19న నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు తెలిపారు. బెంగళూరు గ్రామీణ జిల్లా కౌశల్య మిషన్, జిల్లా పరిశ్రమలు-వాణిజ్యకేంద్రం, దొడ్డబళ్ళాపుర పరిశ్రమల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తాలూకాస్థాయి ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేళాకు సంబంధించిన సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మేళాలో ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల విభాగాలు, గార్మెంట్స్ సంస్థలు పాల్గొంటాయన్నారు. యువనిధి లబ్ధిదారులకు తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ, డిప్లమో, ఐటీఐ, పీయూసీ, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులకు సైతం అవకాశం కల్పిస్తున్నామన్నారు. నిరక్షరాస్యులు, దివ్యాంగులు కూడా మేళాలో పాల్గొనవచ్చునన్నారు.

డిజిటల్ ప్లానెటోరియం వాహనాలకు పచ్చజెండా

» 17లక్షల మంది విద్యార్థులకు అనుకూలం



పచ్చజెండా చూపుతున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రదేశాలలోని విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి సైన్స్‌ను పరిచయం చేసేందుకు అనుకూలంగా డిజిటల్ మొబైల్ ప్లానెటోరియం వాహనాలకు సీఎం సిద్దరామయ్య పచ్చజెండా చూపారు. విధానసౌధ ప్రాంగణంలో గురువారం సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ ఏర్పాటు చేసిన వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి సమగ్ర సమాచారం అందించనున్నాయన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బోసరాజు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని నగర ప్రాంత విద్యార్థులకే పరిమితం అనేలా కాకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులకోసమే ప్రత్యేకంగా ఏర్పాటుచేశామన్నారు. మంత్రి ప్రియాంకఖర్గే, సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ కార్యదర్శి మంజుల, కే-స్టెప్స్ ఎండీ సదాశివప్రభు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ భద్రత దేశానికి పెనుసవాల్



వివిధ సంస్థల ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశానికి సైబర్ భద్రత, డేటా సీక్రెట్ పెను సవాల్‌గా మారిందని రిలయెన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ గ్లోబల్ బిజినెస్ ఏజీఎం రాఘవేంద్ర దేశ్‌పాండే పేర్కొన్నారు. గురువారం మీడియా ఫ్యూజన్, ఫైస్ మీడియన్, జీఎంబీహెచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో సైబర్ భద్రతపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. డీపీఓలు, సీఐఎస్ఓలు సైబరభద్రతా నిపుణులు, ఐటీ లీడర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త శ్రీంజయ్ బెనర్జీ, రమేశ్ వెంకటీమన్, డాక్టర్ లోపాబసు, సందీప్‌రావ్, జోర్గ్ మొహలా, మ్యాక్ హఫితోపాటు ఇండియన్ రైల్వేస్, పెర్‌సెస్టింట్ సిస్టమ్స్ కార్ల్ జైస్, యూనిలివర్, నెక్స్‌నో లెక్స్ ఆర్బిస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాఘవేంద్ర దేశ్‌పాండే మాట్లాడుతూ ఏఐ ఆధారిత బెదరింపులు పెరిగాయన్నారు. డిజిటలీకరణ పెరిగిన తరుణంలో ఎన్నో సౌలభ్యాలు అందుబాటులోకి వచ్చాయని అంతకుమించి సైబర్ భద్రతకు పెను సవాల్‌గా మారుతోందన్నారు. మైక్రో డేటా రక్షణ, కొత్తభద్రత హద్దులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మెకాఫి గ్లోబల్ సర్వీసెస్ ముఖ్యులు హరిహరన్ మాట్లాడుతూ 2026ను పరిశ్రమలకు సైబర్ భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు పలు కంపెనీలు చేస్తున్న పరిశోధనలు మరింత ఫలితాలు చేరువ కానున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్ల్‌జైస్ డైరెక్టర్ రమేశ్ వెంకటరామన్‌తోపాటు ఇండియన్ రైల్వే సీఐఎస్ఓ అనూప్ దయానంద్ సాధు తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

15వేల మందిని ఆకర్షించేలా సైక్లోథాన్



సైక్లోథాన్ టీ షర్టును ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ సైక్లోథాన్ దేశంలోని 25 రాష్ట్రాలనుంచి 15వేలమందికి పైగా ఆకర్షించేలా పోటీలు నిర్వహించదలిచారు. గురువారం నగరంలో హెచ్‌సీఎల్ బెంగళూరు సైక్లోథాన్ తొలివిడత పోటీల వివరాలను ప్రకటించారు. హెచ్‌సీఎల్ గ్రూప్ వైస్‌చైర్మన్ రజిత్ చాందోలియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ మనీందర్‌సింగ్, గత ఏడాది హైదరాబాద్ విజేత నవీన్‌జాన్‌లు మీడియా సమావేశంలో పాల్గొని టీ షర్టును విడుదల చేశారు. 2026 ఫిబ్రవరి 8న నైస్ రోడ్డులో పోటీలు నిర్వహించదలిచామన్నారు. రూ.30లక్షల బహుమతిని ఇవ్వదలిచారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో పోటీలు జరుపుతున్నట్టు రజత్ చాందోలియా ప్రకటించారు. బెంగళూరులో మారథాన్, వాకథాన్, సైక్లోథాన్‌లకు కొదవ లేదన్నారు. తొలిసారి హెచ్‌సీఎల్ ద్వారా నిర్వహించడాన్ని సంతోషంగా భావిస్తున్నామన్నారు. సైక్లిస్టుల సమాజాన్ని అక్కున చేర్చుకోవాలనే పోటీలు జరుపుతున్నామన్నారు. మనీందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో సైక్లింగ్ పోటీలు పెరుగుతున్నాయని, హెచ్‌సీఎల్‌తో కలసి పోటీలు నిర్వహించడం సంతోషంగా భావిస్తున్నామన్నారు. ప్రొఫెషనల్ సైక్లిస్టుల విభాగంలో 18-35ఏళ్ల వారికి 50కిలోమీటర్ల రేసు, సైక్లిస్టులకు 18ఏళ్ల కంటే ఎక్కువ యసున్నవారికి 50 కిలోమీటర్లు, మౌంటైన్‌బ్యాక్ 32 కిలోమీటర్ల రేసు ఉంటుందన్నారు. గ్రీన్‌రైడ్ విభాగంలో 16ఏళ్ల పైబడినవారికి 16 కిలోమీటర్లు పోటీ ఉంటుంది. ప్రతి రేసులో తొలిముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.